ఆకలి చదువులు



ముస్లాపూర్ పాఠశాలలో సాయంత్రం టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

అందని 'స్నాక్స్'
- టెన్త్ ప్రత్యేక తరగతులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రోజు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇతర గ్రామాల నుంచి ఆటో, సైకిళ్లపై, నడుచుకుంటూ విద్యార్థులు వస్తున్నారు. సాయంత్రం పూట స్నాక్స్ ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు ఆకలి మంటలతో ఇబ్బందులకు గురవుతున్నారు.

అల్లాదుర్గం మండలంలో 5 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉండగ, ఇందులో 207 మంది విద్యార్థులు టెన్త్ చదువుతున్నారు. అల్లాదుర్గం బాలికల, బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో రెడ్డిపల్లి, వెంకట్‌రావ్‌పేట, చెవెళ్ల, బహిరన్‌దిబ్బ, కాయిదంపల్లి అప్పాజీపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. చిల్వేర జిల్లా పరిషత్ పాఠశాలలో మందాపూర్, నడిమితండా, గొల్లకుంట తండా విద్యార్థులు, ముస్లాపూర్ జెడ్పీ పాఠశాలలో బర్దిపూర్, ముప్పారం, ముస్లాపూర్ తండా విద్యార్థులు, గడిపెద్దాపూర్ పాఠశాలలో మాణిక్యరాజ్ తండా, దాదాయ్‌పల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు.

ఆయా గ్రామాల విద్యార్థులు సైకిళ్లపై, ఆటోల్లో, నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు రోజు సాయంత్రం 4–15 నుంచి 5–15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇతర గ్రామాల నుంచి పాఠశాలకు వస్తున్న కొందరు విద్యార్థులు ఉదయం 8–30 గంటలకు ఇంటి నుంచి వచ్చి సాయంత్రం 6 గంటల తర్వాత ఇళ్లకు చేరుకుంటున్నారు. ప్రస్తుతం చలికాలంతో పాటు తొందరగా చీకటి కావడంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు.

అలమటిస్తున్నాం

అల్లాదుర్గం పాఠశాలకు వచ్చే చెవెళ్ల, వెంకట్‌రావ్‌పేట, రెడ్డిపల్లి, అప్పాజీపల్లి, బహిరన్‌దిబ్బ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇళ్లకు చేరుకోవాలంటే సాయంత్రం 6 గంటలు దాటుతోంది. పాఠశాలలో స్నాక్స్ ఇవ్వకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రవాణా భత్యం లేదు

గ్రామీణ ప్రాంత విద్యార్థులు మూడు కిలో మీటర్ల దూరం ఉన్న ప్రభుత్వం పాఠశాలలో చదువుకుంటే గత ప్రభుత్వం రవాణ భత్యం ఇచ్చేది. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున ఏడాదికి రూ.6000 ప్రభుత్వం మంజూరు చేసేది. 2019లో ఒకే ఏడాది గ్రామీణ విద్యార్థులకు రవాణా భత్యం ఇచ్చి రద్దు చేసినట్లు ఉపాధ్యాయులు చెప్పారు.

ఆకలితోనే ఉంటున్నాం



ఉదయం 9 గంటలకే పాఠశాలకు వస్తున్నాం. ఇంటికి వెళ్లేందుకు రోజు సాయంత్రం 6 గంటలు దాటుతోంది. పాఠశాలలో స్నాక్స్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ఆకలితో నిరసించి ఇంటికి వెళ్లాల్సి వస్తోంది.

– అశ్విని, బర్దిపూర్, ముస్లాపూర్ జెడ్పీ పాఠశాల

రవాణా చార్జీలు ఇవ్వండి



ఇతర గ్రామాల్లో చదువుకునేందుకు రవాణా సౌకర్యం లేదు. కొన్ని గ్రామాలకు అసలు ఆర్టీసీ బస్సులు లేవు. చదువుకునేందుకు వెళ్లాలంటే ఆటోలే దిక్కవుతున్నాయి. ఉన్న ఒక్క బస్సు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. పేద విద్యార్థులకు ప్రభుత్వం రవాణా చార్జీలు మంజూరు చేయాలి.

– కైకేశా, విద్యార్థిని ముప్పారం

క్లుప్తంగా

విద్యార్థినికి సన్మానం



శ్రీవల్లిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చెకుముకి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినికి అక్షర సేద్యం ఫౌండేషన్, పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీవల్లి జీవశాస్త్రం చెకుముకి పోటిల్లో ప్రతిభా పోటీల్లో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. పెద్దగొట్టిముక్ల పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించే విద్యార్థులందరికీ రూ.2500 ల చొప్పున నగదు అందజేస్తానని సేద్యం అక్షర ఫౌండేషన్ కార్యదర్శి రాజు ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించండి



డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాపన్నపేట(మెదక్): నాగ్సాన్‌పల్లి సర్పంచ్ పదవి ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ దళిత నాయకులు శుక్రవారం డీపీఓ యాదయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సామెల్ మాట్లాడుతూ.. 20 ఏళ్ల నుంచి నాగ్సాన్‌పల్లి సర్పంచ్ పదవి ఎస్సీలకు రిజర్వు కాలేదన్నారు. జనాభా దామాష పద్ధతి ప్రకారం తమకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామవ్వ, మాణయ్య, సూర్య సింహ, రాముప్ప, రాజ్‌కుమార్, విష్ణు బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వయంకృషితో ఎదగాలి



నాటుకోడి పిల్లలను పంపిణీ చేస్తున్న డీపీఎం

శివ్వంపేట(నర్సాపూర్): మహిళలు స్వయం కృషితో ఎదిగేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ డీపీఎం ప్రకాష్ అన్నారు. శుక్రవారం మహిళా సంఘాల గ్రూపు సభ్యులకు నాటు కోళ్ల పిల్లలను పంపిణీ చేశారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ



దనూరలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన రాజు, ఎస్ఐ రాజేశ్

టేక్మాల్(మెదక్): మండలంలోని దనూర గ్రామంలో రాజాయూత్ అధ్యక్షుడు, వెంకటేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్లంపల్లి రాజు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎస్ఐ రాజేశ్ తెలిపారు. సినీ హీరో వెంకటేష్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఎస్ఐ రాజేశ్ ఆధ్వర్యంలో గ్రామంలోని నిరుపేదలకు, వృద్ధులకు సుమారుగా 100 మందికి పైగా దుప్పట్ల పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గౌతం రాజ్, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు అడివయ్య, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మకు బోనాలు



బోనాలతో భక్తులు

రేగోడ్(మెదక్): మండలంలోని జగిర్యాల గ్రామంలో శుక్రవారం నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఈనెల 15న మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం ఉందని, జాతర సందర్భంగా నల్లపోచమ్మ నాటకం ప్రదర్శిస్తామని నాటక కళాకారుడు నాగప్ప తెలిపారు.

భాషా ప్రావీణ్య పరీక్షలో ప్రతిభ



విద్యార్థులకు అవార్డు, నగదును అందిస్తున్న కవి సుద్దాల అశోక్‌తేజ తదితరులు

నర్సాపూర్: మన సంస్కృతి సంస్థ నిర్వహించిన భాషా ప్రావీణ్య పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చినారని విష్ణు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబరు నెలలో మన సంస్కృతి సంస్థ రాష్ట్ర స్థాయిలో తెలుగు, హిందీ ప్రతిభ పరీక్షలు నిర్వహించిందని చెప్పారు. తమ పాఠశాలలో 9వ తరగతికి చెందిన కె.భవశ్రీ తెలుగులో, 8వ తరగతికి చెందిన మీర్జా అబ్దుల్లా బేగ్ హిందీలో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానాలు దక్కించుకున్నారని చెప్పారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో కవి సుద్దాల అశోక్‌తేజ, శ్రీదైవజ్ఞశర్మ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ధ్రువపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ జామి, వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ అభినందించారు.

ధరిపల్లి పాఠశాలలో మాక్ అసెంబ్లీ



ధరిపల్లి జెడ్పీపాఠశాలలో మాక్ అసెంబ్లీ నిర్వహించిన విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధరిపల్లి జెడ్పీపాఠశాల విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంగా, మంత్రులుగా శాసన సభ స్పీకర్ విద్యార్థులు వ్యవహరించారు. అసెంబ్లీలో పాఠశాల విషయాల నుంచి రాష్ట్ర విషయాల వరకు చర్చించారు. స్పీకర్‌గా అఖిల, ముఖ్యమంత్రిగా వైష్ణవి, ఉప ముఖ్యమంత్రిగా సంజన, మంత్రులుగా దుర్గశ్రీ, మహేశ్, శ్రావణి, స్వాతి, శ్రావ్య, వినయ్ వ్యవహరించారు. కార్యక్రమంలో జెడ్పీపాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు, ఏఏపీసీ చైర్మన్ సంతోష పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు



కబడ్డీలో విజేతగా నిలిచిన గౌతాపూర్ పాఠశాల విద్యార్థులకు పతకాలు అందిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సీఎం క్రీడాపోటీలు శుక్రవారం ముగిసాయి. క్రీడాపోటీల్లో గెలిచిన జట్లకు ఎంపీడీఓ ఆనంద్, తహసీల్దార్ ముసాద్దిక్, మండల విద్యాధికారి విఠల్ పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమేనని, క్రీడాకారులు క్రీడస్ఫూర్తి కనబరచాలన్నారు. మండలస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. త్వరలోనే జిల్లా కేంద్రంలో పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వేదశ్రీ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



కొల్చారం(నర్సాపూర్): వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని విలువైన వస్తువులు చోరీ చేసిన సంఘటన మండలంలోని సంగాయిపేట గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ పొలంవద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి అందులోని సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు రైతు తెలిపాడు. వాటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని, ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన



డీసీసీబీ బ్యాంకులో అవగాహన పొందుతున్న మోడల్‌స్కూల్ విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ ఒకేషనల్ కోర్స్ విద్యార్థులకు బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించారు. శుక్రవారం చిన్నశంకరంపేట డీసీసీబీ బ్యాంకులో లావాదేవీలతో పాటు పొదుపు పథకాలు, ఏటీఎం కార్డు వినియోగం, డబ్బులు జమ చేయడం, తీసుకోవడం వివరాలను వివరించారు. డీసీసీబీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ అఖిల్, క్రాంతి, మోడల్‌స్కూల్ ఐటీ టీచర్ ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

భారీ వాహనం.. కదులుతోంది చూడు..



పాపన్నపేట మీదుగా వెళ్తున్న భారీ వాహనం

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటలో శుక్రవారం భారంగా కదులుతున్న భారీ వాహనం అందరినీ ఆకర్షించింది. 74 చక్రాల భారీ వాహనం మెదక్ నుంచి బయలుదేరి బొడ్మట్‌పల్లి వైపు వెళ్లింది. పెట్రోలియం గ్యాస్ నిల్వచేసే భారీ ట్యాంకర్‌ను మోసుకెళ్తున్న వాహనం హైదరాబాద్ నుంచి గుజరాత్‌కు వెళ్తున్నట్లు డ్రైవర్ తెలిపారు. ఇందుకు సుమారు నెల రోజులు పడుతుందన్నారు. వారం రోజుల క్రితం హైదరాబాద్ నుంచి బయలు దేరినట్లు తెలిపారు.

15న అనంతపద్మనాభ స్వామి వార్షికోత్సవాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అనంతపద్మనాభస్వామి గుట్టపై 44వ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జీవబ్రహ్మైక వేదాంత రాజయోగాశ్రమ నిర్వాహకుడు జ్ఞానేశ్వర్ మహారాజ్ తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించే దత్తజయంతి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కగా చేయాలి

ఎంపీడీఓ శ్రీనివాస్



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కగా చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం కౌడిపల్లితో పాటు ధర్మాసాగర్, కొత్తచెరువుతండాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మొబైల్ ఫోన్‌ల్లో ఆన్‌లైన్ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు పంచాయతీ కార్యదర్శుల వద్ద ఉన్నట్లు చెప్పారు. వాటి ఆధారంగా ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. దరఖాస్తుదారులు ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోధనలో లోపాలు ఉండొద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మెలో ఉన్నప్పటికీ విద్యార్థులకు బోధనలో ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులోని కేజీబీవీని సందర్శించారు. అనంతరం ఆయన పదవ తరగతి విద్యార్థులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, ప్రణాళిక ప్రకారం చదుకోవాలన్నారు. చదువుపై ఆసక్తి కనబరిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా సిబ్బంది సమ్మెలో ఉండడంతో, ఉన్న సిబ్బంది విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను సైతం చూసుకోవాలని కేజీబీవీ సిబ్బందికి సూచించారు.

ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిజాంపేట(మెదక్): గత పాలనలో బీఆర్ఎస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మారుతి అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. 2 రోజుల క్రితం బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని అబద్ధాలు చెప్పారని వాపోయారు. 10 ఏళ్లల్లో బీఆర్ఎస్ చేసింది ఏమి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ ఆరోపణ చేస్తే తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మారుతి, నసీరొద్దీన్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తపస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 17న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ కోరారు. శుక్రవారం మండలంలోని మడూర్ జెడ్పీ పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన సమయంలో ధర్మాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్, శ్రీహరి, హెచ్‌ఎం రవిందర్‌రెడ్డి, మాధవి, అంజనేయులు, శ్రీకాంత్ రెడ్డి, నరేందర్, ప్రమోద్ పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్మ గ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్లు తపస్ మండల అధ్యక్షుడు సిద్ధు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ సత్యనారాయణరావు, జిల్లా బాధ్యులు ఆవిష్కరించారు.

మరమ్మతుల్లో నిర్లక్ష్యం..

ఎండుముఖం పట్టిన వరినారు



ఎండుముఖం పడుతున్న వరినారుని చూపుతున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ మరమ్మతుల్లో సిబ్బంది నిర్లక్ష్యంతో వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వరినారుమడులు ఎండుముఖం పడుతున్నాయి. మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామ పరిధిలో వ్యవసాయ బోరుబావులకు సంబంధించి స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వారం రోజులవుతున్నా.. మరమ్మతులు చేయకపోవడంతో నారుమడులు ఎండిముఖం పడుతున్నాయని రైతులు జోగయ్య, ప్రకాష్, నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సిబ్బందికి చెప్పినా.. పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయం గురించి ఇన్‌చార్జి ఏఈ సాయికుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. కొంతన్‌పల్లిలో కొత్త స్తంభం ఇచ్చారని, విద్యుత్ సరఫరాపై చర్యలు తీసుకుంటానని చెప్పారు.

రైతులకు బేడీలు వేయడమే ప్రజాపాలన

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం

దుబ్బాక: ప్రజాపాలన అంటే రైతులకు బేడీలు వేయడమేనా అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన రైతు హీర్యానాయక్‌కు గుండె నొప్పివస్తే ఆస్పత్రికి కూడా చేతికి బేడీలువేసి తీసుకెళ్లడం దారుణమన్నారు. సంక్షేమ హాస్టల్స్‌ల్లో సమస్యలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి

సిద్దిపేటజోన్: గిరిజన రైతుకు సంకెళ్లు వేసిన ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రిమాండ్‌లో ఉన్న రైతుకు ఛాతీ నొప్పి వస్తే బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకువెళ్లడం దారుణం అన్నారు. లగచర్ల రైతులందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రిటైర్డు ఉద్యోగులు లైవ్ సర్టిఫికెట్స్ అందించాలి

పెద్దశంకరంపేట(మెదక్): రిటైర్డు ఉద్యోగులు డిసెంబర్ నెలాఖరులోగా తమ లైవ్ సర్టిఫికెట్స్‌ను ఎస్‌టీఓ కార్యాలయంలో అందజేయాలని మండల రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింలు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. లైవ్ సర్టిఫికేట్స్ అందించకపోతే వచ్చే ఏడాది పెన్షన్ నిలిచిపోతుందని, రిటైర్డు ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

◆ నేడు దత్తజయంతి ఉత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని మానిక్ ప్రభు దేవాలయంతో పాటు గొట్టిముక్కుల దత్తాత్రేయస్వామి ఆలయంలో నిర్వహించే దత్తజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, హోమం, అన్నదానం, రాత్రి 7 గంటలకు దీపారాధన, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

◆ బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామ బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 61వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రామకృష్ణ, 62వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఆంజనేయులు, కార్యదర్శుల శివకుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు హరీశ్, పార్టీ నాయకులు గిరి, నందు, పోచందర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు నిర్మాణం పనులు

తూప్రాన్: పట్టణంలోని 13వ వార్డులో సీసీరోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణం పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లగా ఇబ్బందులు పడిన కాలనీవాసులు, సీసీ పనులతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల సర్వే



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఇందిరమ్మ కమిటీ సభ్యులు పరిశీలించారు. శుక్రవారం నార్సింగిలో ఈఓ నాగభూషణం ఇందిరమ్మ సర్వే నిర్వహించి లబ్ధిదారుల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజేష్, యాదగిరి, రాజేందర్‌రెడ్డి, స్వామి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రవిందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

◆ నిబంధనలతో సురక్షితం

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోగలరని సీఐ సైదా అన్నారు. మండల పరిధిలోని కొల్గూరు శివారులోని మూల మలుపుల వద్ద శుక్రవారం ప్రమాద హెచ్చరిక, సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమన్నారు.

◆ కాంగ్రెస్ ప్రభుత్వ పతనం తప్పదు

దుబ్బాక: కాంగ్రెస్ ప్రభుత్వం పతనం కాక తప్పదని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు హీర్యానాయక్‌కు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్లలో తమ భూములు తీసుకోవద్దని ఆందోళన చేసిన రైతులను అరెస్టు చేసి జైల్లో పెట్టడం, రైతుకు గుండెనొప్పి వస్తే ఆస్పత్రికి కూడా బేడీలు వేసి తీసుకెళ్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, భాస్కర్, కిషన్, వంశీ, అశోక్, రమణారెడ్డి, నేహాల్‌గౌడ్, కనకరాజు, నరేశ్, రాజు తదితరులు ఉన్నారు.

◆ విద్యార్థులకు క్రీడా సామగ్రి వితరణ

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు విద్యార్థులకు రూ.5 వేలు విలువ గల క్రీడా సామగ్రిని శుక్రవారం అందజేశారు. వారిని హెచ్‌ఎం సాదత్ అలీ కృతజ్ఞతలు తెలిపారు.